# VISAKHAPATNAM APARTMENT

# RESIDENTS' WELFARE ASSOCIATION (VARWA)

# & NIVAS

---

## News Bulletin – 1

**విశాఖపట్నం** **తేది : 21.05.2021**

-----------------------------------------------------------------------------------------------------------

## పరిచయం

**విశాఖ** నగర ప్రజలందరికీ విశాఖపట్నం అపార్ట్మెంట్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) మరియు నివాస ప్రాంతాల కాలనీల సంఘం (నివాస్) తరపున ప్లవ నామ సంవత్సరంలో కరోనా రక్కసి రెండవ కెరటాన్ని ఎదుర్కొనే ఆరోగ్యం, ధైర్య సాహసాలు కలగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలుపు చున్నవి. గత 15 సంవత్సరాలుగా విశాఖ అపార్ట్మెంట్ వాసులకు వార్వా సుపరిచితమే. విశాఖ సిటీ విస్తరించి మహానగరంగా మార్పు చెందింది. అపార్టుమెంట్లు పెరిగి, అపార్ట్మెంట్ వాసులు అనేక సమస్య లెదుర్కొంటున్నారు. అపార్ట్మెంట్ వాసుల సంక్షేమమే లక్ష్యంగా వార్వా 2005 లో ఆవిర్భవించింది. అనేక సమస్యల పరిష్కారం కోసం జీవీఎంసీ, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వాలతో చేపట్టింది. బిపిఎస్, ఆస్థి పన్ను పెంపు, భూగర్భ మురుగు నీటి పారుదల (యుజిడి), తాగు నీరు వంటి అనేక సమస్యలను చేపట్టింది. సామాన్యులకు అందుబాటులో నున్న బీచ్ ను భూగర్భ పార్కింగ్ మరియు ఇతర హంగులతో ప్రైవేటీకరించి వారి నుండి దూరం చెయ్యడానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించింది. గత సంవత్సరమంతా కరోనా ప్రపంచ ప్రజల బతుకుల్ని ఛిద్రం చేసింది. కరోనా వలన విశాఖ నగర ప్రజ లెదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గారికి మెమొరాండం ఇచ్చింది. కొన్ని సమస్యలను స్థానికంగా చేపట్ట వలసి ఉంటుంది. కొన్ని సమస్యలపై సమైక్య ఉద్యమాలు నిర్వహించ వలసి వస్తుంది. ప్రస్తుతం మనమెదుర్కొంటున్న ఆస్థి పన్ను సమస్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం. కరోనా వల్ల విలవిల లాడుతున్న ప్రజలను ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం పట్టణ సంస్కరణలను అమలు చేసి ఇళ్ల పన్నులు పెంచాలని, తాగు నీరు, మురుగు నీరు వంటి సదుపాయాల కోసం యూజర్ చార్జీలు వసూలు చెయ్యాలని రాష్ట్రాలకు ఆదేశించింది. ఈ ఆదేశాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ చట్టాలు సవరణ చేసింది. దీనికి వ్యతిరేకంగా గత 4, 5 నెలలుగా మనం పోరాడుతున్నాము. ఫలితంగా ఈ ఏప్రిల్ 1 వ తేదీ నుండి అమలు కావలసిన మున్సిపల్ చట్టాలను ఒక ఏడాది పాటు రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సమైక్య ఉద్యమం కొనసాగించి శాశ్వతంగా ఈ దాడిని తిప్పి కొట్టాలి.

నివాస ప్రాంతాల లోని కాలనీల సమస్యలపై 'నివాస్' కృషి చేస్తున్నది. గత కొంత కాలంగా నగర ప్రజల సమస్యలపై వార్వా - నివాస్ సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నవి. కాబట్టి, సమస్యను బట్టి స్థానిక పోరాటాలకు గాని, సమైక్య ఉద్యమాలకు గాని అపార్టుమెంట్లు మరియు నివాస ప్రాంతాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. నగర ప్రజల సమస్యలపై జరగుతున్న కృషిని మీతో పంచుకొనే ఉద్దేశంతో ఈ న్యూస్ బులెటిన్ ఆరంభిస్తున్నాము. మీ సహకారాన్ని కోరుతున్నాము.

# పట్టణ ప్రజలపై ఇంటి పన్ను, మంచి నీటి పన్ను, మురుగు నీటి చార్జీలను భారీగా పెంచే ఆర్డినెన్సు16 ను మరియు GO No.196 & 197 లను వ్యతిరేకించండి !

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 23, 2020 వ తేదీన ఆర్డినెన్సు నెంబర్ 16/2020 మరియు రెండు GO లు నెంబర్ 196 &197 జారీ చేసింది. ఇది అత్యంత ప్రమాదకరమైన దాడి. ఇంటిపన్ను భారీగా పెంచే ఆర్డినెన్సు ఇది. ఒక్కసారి కాదు. ప్రతీ సంవత్సరము పెంచుతుంది. ఇంటిపన్ను లెక్క కట్టే విధానాన్ని మార్చింది. దీని వలన మంచి నీటి చార్జీలు , మురుగు నీటి చార్జీలు కూడా విపరీతంగా పెరుగు తాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాల వలన ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. కరోనా మిషతో కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీ ల సేవలో మునిగిపోయి రాష్ట్రాలకు ఇవ్వవలసిన GST వాటాలను వేల కోట్లలో బకాయి పెట్టింది. మనకు రావలసిన GST వాటా గురించి అడిగితే అప్పలు తెచ్చుకోమని చెప్పింది. అప్పు తెచ్చుకోవడానికి మన రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంది . అప్పు కోసం కేంద్రం షరతులు పెట్టింది. అవి 1 . పట్టణ సంస్కరణలు అమలు చేసి పన్నులు పెంచాలి 2 . మంచి నీటి చార్జీలు, మురుగు నీటి చార్జీలు పెంచాలి 3 . విద్యుత్ సంస్కరణలు అమలు చేసి, విద్యుత్ చార్జీలు పెంచాలి. సంక్షేమ రాజ్యం అని ప్రకటించుకున్న మన రాష్ట్ర ప్రభుత్వం ఈ షరతులపై అసెంబ్లీ లో పూర్తి స్థాయి చర్చ జరిపి వాటిని తిరస్కరించి ఉండవలసింది. కానీ, ఆలా చెయ్యకుండా ఆ షరతుల అమలు కోసం హడావిడిగా ఈ ఆర్డినెన్సు 16 /2020 మరియు GO నెంబర్ 196 & 197 లను తెచ్చి మనపై దాడి చేస్తున్నది.

ఇప్పటివరకు, ఆంధ్ర ప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్స్ చట్టం 1955 ప్రకారం ఇంటి వార్షిక అద్దె విలువలో 15% కి తగ్గకుండా 30% కి మించకుండా ఇంటిపన్ను నిర్ణయించాలి. ఈ పరిమితులకు లోబడి జీవీఎంసీ కౌన్సిల్ నిర్ణయించిన ఇంటి పన్ను శాతాన్ని మనం చెల్లిస్తున్నాము. 01.04.2021 నుండి అమలులోకి రానున్న పై ఆర్డినెన్సు 16/2020 ప్రకారం నివాస గృహాలకు ఆస్థి విలువలో 0.10% నుండి 0.50% వరకు ఇంటిపన్ను నిర్ణయిస్తారు. నివాసేతర గృహాలకు 0.20% నుండి 2.00% వరకు నిర్ణయిస్తారు. వ్యక్తిగత గృహాలకు ఆస్థి విలువ అంటే స్థలం విలువ మరియు ఆ స్థలంలో ఉన్న భవనం విలువల మొత్తం. ఈ వివరాలు రిజిస్ట్రార్ ఆఫీస్ లో లభిస్తాయి. భవనం RCC బిల్డింగ్ అయితే భవనం విలువ చ. అ. కు రు.1200/- లు. ప్లింత్ ఏరియాను 1200 చేత గుణిస్తే భవనం విలువ వస్తుంది. ఇతర రకాలయిన కట్టడాలకు రేట్లు వేరుగా ఉంటాయి. అపార్టుమెంట్లకు స్థలం విలువ మరియు భవనం విలువ వేర్వేరుగా ఉండవు. చ. అ. కి కాంపోజిట్ రేట్ నిర్ణయిస్తారు. అపార్ట్మెంట్ వైశాల్యాన్ని కాంపోజిట్ రేట్ తో గుణిస్తే అపార్ట్మెంట్ విలువ వస్తుంది.

ఇంటి పన్ను ప్రాతిపదికను వార్షిక అద్దె విలువ నుండి ఆస్థి విలువకు మార్చడం వలన ఇంటి పన్నులు దాదాపు 4 నుండి 10 రెట్ల వరకు పెరిగే ప్రమాదముంది. ప్రతి సంవత్సరము ఆగష్టు నెలలో భూముల విలువ పెంచుతారు. భూముల విలువ పెరిగినప్పడల్లా ఇంటి పన్నులు ఆటోమేటిక్ గా పెరుగుతాయి. ప్లాను ఉల్లంఘించి నిర్మాణాలు చేస్తే30% పెనాల్టీ. ప్లాన్ లేకుండా నిర్మిస్తే 100% వరకు పెనాల్టీ. ఇప్పటివరకు 5 ఏళ్లకు ఒక సారి ఇంటిపన్నులు సవరించేవారు. (మన జీవీఎంసీ కి ఎన్నికలు జరగనందువలన గత 12 ఏళ్లుగా ఇంటి పన్నులు పెంచలేదు.) పట్టణ పౌర సంక్షేమ సంఘాలు మరియు వామపక్ష పార్టీ ల నుండి తీవ్ర వ్యతిరేకత రావడం వలన ఇంటిపన్నుల15% కి పెంపుదలను 15% కి పరిమితం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం GO లో చేర్చింది. దాని ప్రకారం కూడా ఇంటి పన్ను ప్రతి ఏడాది 15% వరకు పెరుగుతూనే ఉంటుంది.

ఇంతటితో ఆగకుండా రాష్ట్ర ప్రభుత్వం మంచినీటి ఛార్జీలు, భూగర్భ డ్రైనేజీ ఛార్జీలు పెంచడానికి వీలుగా GO నెంబర్ 196 & 197 లను విడుదల చేసింది. మంచినీటి ఛార్జీలు నెలకు రు.100/- నుండి రు.350/- వరకు మరియు అపార్ట్మెంట్లకు నీటి మీటర్ల ఆధారంగాను వసూలు చేస్తారు. బల్క్, సెమి బల్క్ టాప్ లకి కిలో లీటర్ నీటి కి చార్జీలు రు30/- లనుండి రు50/- లకి పెంచారు. మరుగు దొడ్ల సంఖ్య ఆధారంగా భూగర్భ డ్రైనేజి ఛార్జీలు వసూలు

చేస్తారు. సదుపాయాలు కల్పించడానికి మరియు నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చులను యూజర్ చార్జీల ద్వారా వసూలు చేస్తారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు రాజ్యాంగ బద్ధంగా కేటాయించ వలసిన నిధులు కేటాయించడం లేదు. పౌర సేవలకు కూడా అదనంగా ఛార్జీలు వసూలు చెయ్యాలని నిర్దేశిస్తూ చట్టాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల హక్కులు మరియు అధికారాలను అప్రజాస్వామికంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయి.

01.04.2021 నుండి ప్రతి ఏటా రాష్ట్రంలోని పట్టణ ప్రజలపై పది వేల కోట్ల రూపాయలకు పైగా భారాలు మోపే ఈ పన్నుల ఆర్డినెన్సు మరియు GO లను ఉపసంహరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం పై వత్తిడి తేవాలి. ఇప్పటికే రాష్ట్ర నలుమూలలా అనేక సంఘాలు వీటికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. వామపక్ష రాజకీయ పార్టీలు మద్దతు నిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరమైన విశాఖ సిటీ లో కూడా VARWA మరియు నివాస్ సంఘాల నాయకత్వంలో సంయుక్తంగా నిర్వహించే పోరాటంలో పాల్గొనాలని పురజనులు యావన్మందికి విజ్ఞప్తి చేస్తున్నాము.

## ఆస్థి పన్ను పెంపు పై సదస్సులు

'ఆస్థి పన్ను పెంపు - ప్రజలపై ప్రభావం' అనే అంశం పై పై ద్వారకా నగర్ లోని పబ్లిక్ లైబ్రరీ లో డిసెంబర్ 22 న వార్వా - నివాస్ సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. దీనిలో AP పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ Ch బాబురావు , విజయవాడ టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి MV ఆంజనేయులు మరియు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదే రోజున గాజువాక , అనకాపల్లి లో కూడా సదస్సులు నిర్వహించి పై ఆర్డినెన్సు, జీఓ ల పై అవగాహనా కల్పించారు.

**Ch బాబూరావు :**

"కరోనా కష్ట కాలంలో ఆదాయం కోల్పోయిన ప్రజలను, విద్య, వ్యాపార, వాణిజ్య సంస్థలను ఆదుకోవలసింది పోయి పెను భారాలను మోపేలా సంస్కరణలను తేవడం బాధాకరం. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ముదనష్టపు సంస్కరణలు అమలు చేయం అని ప్రకటించడమే కాకుండా పన్నులను తగ్గించి ఊరట కలిగిస్తున్నారు. కానీ, మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లొంగిపోయి ఏక పక్షంగా మునిసిపల్ చట్టాలు మార్చేసి పట్టణ ప్రజలపై పెను భారాలు మోపుతున్నది. ఈ చర్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా అన్ని పట్టణాల లోనూ ప్రజలు పోరాడుతున్నారు." అని అన్నారు.

## జీవీఎంసీ వద్ద ధర్నా

ఆస్థి పన్ను విధింపు లో సంస్కరణలు, ఆస్థి పన్ను పెంపు, త్రాగునీటి చార్జీల పెంపు, మురుగు నీటి పన్ను, పారిశుధ్యం పై యూజర్ చార్జీలు వసూలు వంటి భారాలు వేసి పట్టణ ప్రజల నడ్డి విరగ్గొడు తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఈ చర్యలను నిరసిస్తూ విశాఖ లో జీవీఎంసీ ఆఫీసు వద్ద జనవరి 6 వ తేదీన ధర్నాను విజయవంతం గా నిర్వహించారు. ఈ ధర్నాలో సంబంధిత జీఓ లు, ఆర్డినెన్సు లను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండు చేస్తూ తీర్మానించి , ఆ తీర్మానాన్ని జీవీఎంసీ కమీషనర్ కు అంద జేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి A అజ శర్మ, ఐద్వా నాయకులు RN మాధవి, P మణి, ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ T కామేశ్వర రావు, మెడికల్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ నాయకులు KVP చంద్ర మౌళి పాల్గొన్నారు. వార్వా అధ్యక్షులు N ప్రకాశ రావు మరియు నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణ మూర్తి ధర్నాకు నాయకత్వం వహించారు.

ధర్నా ను ప్రారంభిస్తూ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి శ్రీ అజ శర్మ "ఆస్థి పన్ను పెంపు అనేది సాధారణంగా జరిగేదే. అందులో వింత లేదు. కానీ, ఈసారి జరుగుతున్న పెంపుదలలో ప్రత్యేకత ఉంది. అదేమిటంటే, ఆస్థి పన్నుల్ని నిర్ణయించే పద్ధతే సమూలంగా మార్చి వేశారు. ఇన్నాళ్లు, ఇంటి మీద వచ్చే అద్దె ఆధారంగా ఇంటి పన్ను విధించే వారు. ఇప్పుడు, అలా కాకుండా దాని ఆస్థి విలువ ఆధారంగా పన్ను విధిస్తారు. ఈ రెండింటికి చాలా తేడా ఉంది. ఆస్థి విలువని స్టాంప్స్ & రిజిస్ట్రేషన్స్ శాఖ వారు ప్రతి సంవత్సరం ఆగష్టు 1 వ తేదీన పెంచేస్తారు. అద్దె పెరగక పోయిన ఆస్థి విలువ పెరిగిపోయి ఉంటుంది. దీని వలన తక్షణమే ఇంటి పన్ను దాదాపు 10 రెట్లు పెరుగుతుంది. ప్రతి ఏడాదీ

పెరుగుతూనే ఉంటుంది. అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్న జగనన్న, ఏప్రిల్ 1 వ తేదీ నుండి పట్టణ ప్రజల మీద 'భారాల పథకం' కూడా అమలు చేస్తున్నాడు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రజలు పోరాడుతున్నారు. మన విశాఖ లో ఈ పోరాటం వార్యా- నివాస్ నాయకత్వంలో జరుగుతోంది. పౌరులంతా సహకరించాలి" అని అన్నారు.

## ఆస్థి పన్ను పెంపు పై నిరసనలు:

ఆస్థి పన్ను పెంపు మరియు ఇతర భారాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 6 వ తేదీన ధర్నాలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, ఆముదాలవలస , పాలకొండ , విజయనగరం జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు , విశాఖపట్నం జిల్లాలో భీమిలి, నర్సీపట్నం, సిటీలో గాజువాక, అనకాపల్లి, గోపాలపట్నం, మధురవాడ, జీవీఎంసీ ధర్నాలు విజయవంతంగా నిర్వహించారు. ఇదే విధంగా ఇతర జిల్లాల్లో కూడా నిర్వహించారు. మొత్తంగా 75 కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

### శ్రీకాకుళం, తిరుపతి, కర్నూలు నగరాల నోటిఫికేషన్లు :

ఒక వైపు కరోనా మహమ్మారి సోకుతుందని భయం ఉన్నప్పటికీ, రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రజానీకం ఆస్థి పన్ను తదితర భారాలపై నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. వేరొక వైపు రాష్ట్ర యంత్రాంగం వివిధ నగరాల్లో నోటిఫికేషన్ లు జారీ చేస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్డినెన్సులు , జీఓ ల ఆధారంగా శ్రీకాకుళం, తిరుపతి మరియు కర్నూలు నగరాల కార్పొరేషన్లు ఆస్థి పన్ను పై నోటిఫికేషన్లను జారీ చేసారు. ఆస్థి మూల విలువ ఆధారంగా ఆస్థి పన్ను విధించుటకు నిర్దేశించడమైనది. దాని ప్రకారము ఆస్థి పన్ను నివాస భవనముల మూల విలువ మొత్తముపై 0.15 % గాను, నివాసేతర భవనముల మూల విలువపై0..30 % గాను మరియు ఖాళీ స్థలంపై ఆస్థి పన్ను 0.50 % గాను నిర్ణయించడ మైనది అని నోటిఫికేషన్లలో తెలిపారు.

పన్ను శాతం తక్కువగా కనిపించ వచ్చు. కానీ, ఇది ఆస్థి మూల విలువ మీద లెక్కిస్తారు. గతంలో అద్దె విలువ మీద లెక్కించే వారు. అద్దె విలువ కంటే ఆస్థి విలువ ఎన్ని రెట్లు ఉంటుందో గమనం లో పెట్టుకుంటే ఈ భారం ఎంత పెద్దదో అర్థమవుతుంది.

### గుంటూరు లో చెత్తగా ఉన్న ఖాళీ స్థలాలపై అదనపు పన్ను :

గుంటూరు లో మురికి నీరు, చెత్త చెదారంతో ఉన్న ఖాళీ స్థలాలపై ఆస్థి మూల విలువపై 0.25 % అదనపు పన్ను విధించాలని మునిసిపల్ కమీషనర్ ఆదేశించారు. అటువంటి స్థలాలను ఇటీవలే గుర్తించి ఆయా ఓనర్లకు మునిసిపల్ కార్పొరేషన్ వారు నోటీసులు కూడా జారీ చేశారు.

### బెంగుళూరు లో 2 % రోడ్ ట్రాన్స్పోర్ట్ సెస్ :

బెంగుళూరు లో ఈ ఏప్రిల్ 1 వ తేదీ నుండి ఆస్థి పన్ను లో 2% అదనంగా రోడ్ ట్రాన్స్పోర్ట్ సెస్ విధించారు. బృహత్ బెంగుళూరు మహానగర పాలిక రెండేళ్ల క్రితమే రోడ్ ట్రాన్స్పోర్ట్ సెస్ వసూలు చెయ్యాలని తీర్మానం ఆమోదించింది. కానీ, ప్రజల నిరసన కు భయపడి అమలు చెయ్యలేదు. కానీ, ఇప్పుడు అమలు చెయ్యాలని నిర్ణయించారు. బెంగుళూరు లో దాదాపు 20% మంది ఆస్థి పన్ను ఎగ్గొడుతున్నారు. ఎగ్గొట్టే వారిని గాలికి వదిలేసి, బుద్ధిగా ఆస్థి పన్ను చెల్లించే వారి నడ్డి విరుస్తోంది అక్కడి ప్రభుత్వం.

# పన్నుల పెంపు & యూజర్ చార్జీలపై కౌన్సిల్ లో చర్చించాలని కోరుతూ

# నగర మేయర్ శ్రీమతి గొలగాని హరి వెంకట కుమారి గారికి

# 'వార్వా- నివాస్' మార్చి 29 న సమర్పించిన వినతి పత్రాలు

**గౌరవనీయులైన మేయర్ గారికి,**

అమ్మా,

విశాఖ మహా నగర మేయరు గా ఎన్నికై, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తమకు శుభాకాంక్షలు తెలుపుతున్నాము.

దశాబ్ద కాలం తర్వాత విశాఖ మహా నగర ప్రజల ఓట్లతో ఎన్నికయిన జివిఎంసి కౌన్సిల్ తమ నాయకత్వం లో ప్రజాతంత్ర విధానానికి శ్రీకారం చుడుతుందని, ప్రజల బాధలు నివారించేలా నిర్ణయాలు చేస్తుందని విశాఖపట్నం అపార్ట్మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ( వార్వా ) ఆశిస్తున్నది.

ఏప్రిల్ 1 వ తేదీ నుండి అమలు చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆస్తి పన్ను పెంపు, మంచి నీటి ఛార్జీల పెంపు, చెత్త సేకరణ మరియు మురుగు నీటి ఛార్జీల పై యూజర్ ఛార్జీల వసూలు పై జివిఎంసి కౌన్సిల్ లో పూర్తి స్థాయి చర్చ జరిపి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

కరోనా లాక్డౌన్ లో చిక్కుకున్న ప్రజల్ని ఆదుకోవడానికి బదులు పట్టణ సంస్కరణల ను అమలు చేసి ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 196, 197, 198 జివోలను జారీ చేసింది.

ప్రస్తుతం అమలులో ఉన్న ఇంటి అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధించే పద్ధతిని రద్దు చేసి, ఆస్తి మార్కెట్ విలువ ఆధారంగా లెక్కించి, ఆస్తి పన్ను విధించే పద్ధతికి మార్చి చట్టం చేసింది. ఈ చట్టం అమలు చేస్తే, నివాస గృహాలపై కూడా ఆస్తి పన్ను ఎన్నో రెట్లు పెరుగుతుంది. అంతే కాకుండా, ప్రతి ఏడాదీ ఆస్తి మార్కెట్ విలువ ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేస్తుంది. కాబట్టి, ఇప్పుడు అమలు లో ఉండే విధంగా 5 ఏళ్ళకు ఒకసారి కాకుండా ప్రతీ సంవత్సరం ఆస్తి పన్ను పెరుగుతూ పోతుంది. ఇది పేద ప్రజలకు, అపార్ట్మెంట్ లలో నివసించే మధ్య తరగతి ప్రజలకు భరించలేని భారమవుతుంది.

ప్రతి ఇంటికి నీటి మీటరు బిగించి, దాని రీడింగ్ ఆధారంగా మంచి నీటి సరఫరా యొక్క ఆపరేషన్, మెయింటెనెన్స్ కి అయ్యే మొత్తం ఖర్చును ( కాస్ట్ టు కాస్ట్ ) పద్ధతిలో ప్రజల నుండి రాబట్టాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. దీని వల్ల మంచి నీటి ఛార్జీలు 3 నుండి 4 రెట్లు పెరుగుతాయి. ఇదే విధంగా చెత్త సేకరణ మరియు మురుగు నీటి సదుపాయాలకు కూడా యూజర్ ఛార్జీలు వసూలు చెయ్యాలని నిర్ణయించారు.

పట్టణాలు, నగరాల అధికారులు ఆమోదం తీసుకొని ఏప్రిల్ 1 వ తేది నుండి ఈ చట్టం అమలుకు అప్రజాస్వామికం గా రంగం సిద్ధం చేశారు. ఈ చట్టం అమలయితే , విశాఖ లో సామాన్య ప్రజలు బతకలేక

వలసలు పోయే దుస్థితి దాపురిస్తుంది. కాబట్టి, వార్వా ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

ఆస్తి పన్ను విధింపు, పౌర సదుపాయాల కల్పన స్థానిక సంస్థల పరిధి లోనివి. విశాఖ మహా నగర ప్రజల ఓట్లతో నెగ్గిన కార్పొరేటర్లతో కూడిన కౌన్సిల్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రజల బాధలు నివారించాలి. సంతృప్తి చెందిన ప్రజల సహకారం తో నగరాభివృద్ధి చెయ్యాలి. కాబట్టి, ఆస్తి పన్ను పద్ధతి మార్పు, ఆస్తి పన్ను పెంపు, మంచి నీటి ఛార్జీల పెంపు, యూజర్ ఛార్జీలపై జివిఎంసి కౌన్సిల్ లో పూర్తి స్థాయి చర్చ జరిపి, ప్రజలపై తీవ్ర భారాలు మోపే ఆదేశాలను తిరస్కరించాలని, నగర ప్రజల జీవన స్థితిగతుల కనుగుణంగా కౌన్సిల్ లో నిర్ణయాలు చెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కౌన్సిల్ నిర్ణయించే లోగా, ఆస్తి పన్ను, నీటి ఛార్జీల పెంపు, చెత్త సేకరణ, మురుగు నీటి పై యూజర్ ఛార్జీలు అమలు కోసం ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోరుతున్నాము.





మేయరు గారిని కలిసిన పిట్టా నారాయణ మూర్తి, N ప్రకాశ రావు, BB గణేష్ మరియు టి కామేశ్వర రావు.

ఇవే అంశాలతో కూడిన వినతి పత్రాలను వార్వా - నివాస్ ప్రతినిధి వర్గం GVMC తెలుగు దేశం నాయకుడు శ్రీ పీలా శ్రీనివాస రావు గారికి కూడా 08.04.2021 వ తేదీన అంద జేశారు.



శ్రీనివాస రావు గారిని కలిసిన ప్రతినిధి బృందంలో రమణి, ప్రభాకర రావు, టి కామేశ్వర రావు, బి బి గణేష్, అప్పల రాజు, MG శేషగిరి రావు మరియు KVS కామేశ్వర రావు వున్నారు.

**ఆస్థి పన్ను పాత పద్ధతి లోనే**

ఈ సంవత్సరానికి ఆస్థి పన్ను పాత పద్ధతి లోనే అంటే అద్దె విలువ ఆధారంగానే లెక్క కట్టి వసూలు చెయ్యాలని, ఆస్థి విలువ ఆధారంగా లెక్కించ రాదని మరియు ఏప్రిల్ నెలలో చెల్లించే వారికీ 5% రిబేటు ఇవ్వాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జరీ చేసింది.

ఈ నిర్ణయాన్ని వార్వా ఆహ్వానిస్తున్నది. ఏప్రిల్ నెలలో ఆస్థి పన్ను చెల్లించి ప్రభుత్వం ఇచ్చిన రాయితీని పొందవలసిందిగా విశాఖ పౌరులకు వార్వా విజ్ఞప్తి చేసింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతున్న ప్రజల విజయం. ఆస్థి విలువ ఆధారంగా ఆస్థి పన్ను లెక్కించరాదని మరియు కరోనా లక్డౌన్ తో బాధల్లో చిక్కుకున్న ప్రజలపై ఆస్థి పన్ను పెంచడం ద్వారా మరిన్ని భారాలు వెయ్యరాదని వార్వా - నివాస్ వంటి అనేక పౌర సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలు పోరాడుతున్నారు. చివరికి, రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి, ఈ సంవత్సరానికి అమలు పరచ వద్దని ఆదేశాలు జరీ చేసింది. ఈ ఆదేశాలు ఈ సంవత్సరానికి మాత్రమే వర్తిస్తాయి.

నూతనంగా ఎన్నికయిన కౌన్సిల్ లో ఈ అంశాలపై విపులంగా చర్చ నిర్వహించి, పన్నులు, యూజర్ చార్జీల పై విశాఖ నగర ప్రజల జీవన స్థితిగతులకు అనుగుణంగా సానుకూల నిర్ణయాలు చెయ్యాలని నగర మేయర్ గారిని వార్వా కోరుతున్నది.

**ఇంటి పన్ను గడువు పెంపు పై నగర మేయర్ గారికి వార్వా మే 4 వ తేదీన రాసిన లేఖ:**

విషయం: ఇంటి పన్ను గడువు పెంపు

కరోనా రెండవ అల విజృంభిస్తున్నది. నగరం లో వేలాదిమంది కరోనా వ్యాధి కి గురవుతున్నారు, వందలలో బలవుతున్నారు. ప్రజలు కరోనా భయంతో వణికి పోతున్నారు. ఇటువంటి సమయంలో ఇంటి పన్ను కట్టాలనే వత్తిడి అసమంజసం. ప్రజల బాధలు అర్థం చేసుకొని ఇంటి పన్ను చెల్లించడానికి వెసులుబాటు కల్పించాలి.

కాబట్టి, ఇంటి పన్ను చెల్లించడానికి రిబేటు తో సెప్టెంబర్ నెలాఖరు వరకు అవకాశం కల్పించాలని, అలాగే, ఈ ఆర్థిక సంవత్సరంలో ఎప్పుడు చెల్లించినా అపరాధ రుసుమును మాఫీ చెయ్యాలని తమకు విజ్ఞప్తి చేస్తున్నాము.

ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికయిన తమరు విశాఖ నగర జనుల బాధలు అర్థం చేసుకొని పై వెసులుబాటు కల్పిస్తారని ఆశిస్తున్నాము.

**ఇదే అప్పీలుతో వేరే లేఖను GVMC కమీషనర్ గారికి పంపించడమైనది.**

# 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' ప్రభాత భేరీలు

స్వతంత్ర భారతదేశ నిర్మాణం లోనూ, ప్రగతి సాధన లోనూ ప్రభుత్వ రంగ సంస్థలది కీలక పాత్ర. స్వాతంత్ర్య ఫలాలను అన్ని కులాలూ, తెగలూ, మతాలూ, ప్రాంతాల వారికీ అందించడం లో అద్భుతమైన కృషి జరిపాయి. ఆర్థిక వ్యవస్థ కు వెన్ను దన్నుగా నిలిచాయి. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన 2008 ఆర్థిక సంక్షోభాన్ని భారతదేశం తట్టుకొని నిలబడటానికి ప్రధాన కారణం ఇక్కడ ప్రభుత్వ రంగం బలం గా ఉండడమే నని ఎంతో మంది ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వ రంగం చావడానికే పుట్టింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరిస్తామని, ప్రైవేటు వారికి అమ్మేస్తామని, కొనడానికి ఎవరూ రాకపోతే మూసేస్తామని నిర్లజ్జగా మోడీ ప్రభుత్వం ప్రకటించింది.

మన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (RINL ) అనగా మన వైజాగ్ స్టీల్ ప్లాంట్ పోరాడి సాధించుకున్న ది. లక్షలాది మంది ప్రజల భాగస్వామ్యం తో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం, వందలాది లాఠీ ఛార్జీలు, 32 ప్రాణాల బలిదానం, 67 మంది వామపక్ష MLA ల రాజీనామా లు, 17 వేల మంది రైతులు ఇచ్చిన 22 వేల ఎకరాల భూమితో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆవిర్భవించింది. అందుకే విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అయింది. ఇది రష్యా సహకారంతో నిర్మించ బడిన అత్యాధునిక స్టీల్ ప్లాంట్. దీని కెపాసిటీ ని పెంచడానికి బ్యాంకు ల నుండి అప్పు తీసుకున్నారు. ప్రతి స్టీల్ ప్లాంట్ కీ కేటాయిస్తున్నట్లు ఈ ప్లాంట్ కి సొంత గనులు కేటాయించ లేదు. కాబట్టి, ముడి ఇనుము మార్కెట్లో కొనుగోలు చేసుకోవాలి. వీటి వల్ల ఖర్చులు పెరిగాయి. అయినా సరే లాభాల బాటలో నడుస్తూ ఉంది.



విశాఖ నగర అభివృద్ధిలో స్టీల్ ప్లాంట్ పాత్ర కీలకమైనది. అందుకే ఈ నగరాన్ని స్టీల్ సిటీ గా పిలుస్తారు. ఇలా ప్రజల జీవితాలతో పెనవేసుకు పోయిన ఈ స్టీల్ ప్లాంట్ ని కూడా పోస్కో కి అమ్మకానికి పెట్టారు. ఈ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాటం ఉధృతంగా సాగుతున్నది. ఈ పోరాటానికి వార్వా నివాస్ గా మద్దతు తెలుపుతున్నాము. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే నినాదం తో వార్వా - నివాస్ సంయుక్తంగా ఏప్రిల్ 11, 14 తేదీల్లో సీతమ్మధార, హెచ్ బి కాలనీ, మద్దిలపాలెం ప్రాంతాల్లో ప్రభాత భేరీ కార్యక్రమాలు నిర్వహించాం.

**ప్రభాత భేరి లో A అజ శర్మ, ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక :**

'దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వ రంగాన్ని ఆత్మనిర్భర్ భారత్ పేరుతో అమ్మేయాలని నిర్ణయించడం పచ్చి మోసం, దగా. ప్రజల మద్దతు తో ఈ దాడులను తిప్పి కొట్టాలి. మన స్టీల్ ప్లాంట్ కి సొంత గనులు సాధించుకోవాలి' అని అన్నారు.




సీతమ్మధార ప్రభాత భేరీ లో ప్రసంగిస్తున్న A అజ శర్మ.

**ప్రభాత భేరీ లో Dr P రామారావు, Retd. DM&HO :**

'దేశ ప్రగతి కోసం ప్రభుత్వ రంగ పరిశ్రమలు బ్రహ్మాండ మైన కృషి జరిపాయి. ముఖ్యంగా విశాఖపట్నం లో పోర్టు ట్రస్టు, స్టీల్ ప్లాంటు, హిందుస్థాన్ షిప్ యార్డు, హెచ్ పీసీఎల్, ఎల్ఐసి, బ్యాంకు లు లక్షలాది ఉపాధి అవకాశాలు కల్పించడం, చిన్న పరిశ్రమలకు, వ్యాపారుల కు చేయూత నందించి అభివృద్ధి చెయ్యడం మొదలగు చర్యల ద్వారా నగరాభివృద్ధి కి ఎంతో దోహదపడ్డాయి. అలాంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మి వెయ్యడమంటే, నగరాన్ని సంక్షోభంలోకి నెట్టడమే అవుతుంది. స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో ని వేలాది రైతులు తమ తర్వాతి తరానికి ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఆశతో తమ కష్టార్జితం అయిన వేల ఎకరాల పొలాలను స్టీల్ ప్లాంట్ కోసం ధారాదత్తం చేశారు. ఈ స్టీల్ ప్లాంట్ ను అమ్మే హక్కు కేంద్రానికి కూడా లేదు. కాబట్టి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ఎటువంటి పరిస్థితుల్లోనూ అమ్మడానికి ఒప్పుకోం' అని రామారావు గారు అన్నారు.




మద్దిలపాలెం లో ర్యాలీ గా.......




HB కాలని జంక్షను లో......




ప్రభాత భేరీ లో ప్రసంగిస్తున్న Dr P రామారావు

# కోవిడ్ రెండో కెరటం - సంక్షోభం - వేక్సిన్ ఆవశ్యకత.

కోవిడ్ మహమ్మారి రెండో కెరటం విశ్వరూపం చూపిస్తున్నది. దేశంలో ప్రచండ వేగంతో వృద్ధి చెందుతున్నది. అధికారిక గణాంకాల ప్రకారమే రోజుకు దాదాపు మూడు నుండి నాలుగు లక్షల మంది వ్యాధికి గురవుతున్నారు, నాలుగు వేలమంది పైగా మరణిస్తున్నారు. వాస్తవానికి ఈ గణాంకాలు ఎన్నో రెట్లు అధికంగా ఉంటాయని మీడియా రిపోర్టుల ద్వారా తెలుస్తోంది. ప్రజానీకం వైరస్ భయంతో గజగజ వణికి పోతున్నారు.

విశాఖపట్నం లో కోవిడ్ రెండో అల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. టెస్టు రిపోర్టులు ఆలస్యం వస్తున్నాయి. పాజిటివ్ వచ్చిన వారికి ఐసోలేషన్ కేంద్రాలు చాలడం లేదు. ఇటీవల వీటిని పెంచారు. Hospitalisation అవసరమైన వారికి ఆసుపత్రుల్లో బెడ్స్ లేవు. బెడ్స్ దొరికినా ఆక్సిజన్ బెడ్స్ లేవు. విషమించిన పేషెంట్లకు వెంటిలేటర్లు అందుబాటులో లేవు. మందులు కూడా పూర్తిగా అందుబాటులో లేవు. క్రిటికల్ కేర్ లో డాక్టర్లు రాస్తున్న రెమ్డెసివర్, టాసిలిజుమాబ్ వంటి మందులు అందుబాటులో లేక పేషెంట్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పేషెంట్ల బంధువులు, మిత్రులు ఈ మందులను లక్షలు ఖర్చు చేసి బ్లాక్ లో కొనుగోలు చేస్తున్నారు. పేదలకు ఈ మందులు అందని ద్రాక్షే. ఇలా, కోవిడ్ తో గాని కోవిడ్ పర్యవసానంగా వచ్చే ఇతర సమస్యలతో గాని ఎంతో మంది చనిపోతున్నారు.

మరణించిన వారికి దహన సంస్కారాలు నిర్వహించడం పెద్ద సమస్య గా మారింది. మరణించిన వ్యక్తి ముఖం మాత్రం బంధుమిత్రులకు చూపించి, శవాలను ఒకదానిపై మరొకటి దొంతరలు గా అంబులెన్స్ లలో స్మశానవాటికలకు తరలిస్తున్నారు. అక్కడ కొన్ని గంటలు వేచి యున్న తరువాత శవ దహనం గాని ఖననం గాని చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండదు. అంబులెన్సు లకు, దహన సంస్కారాలకు దాదాపు 40 నుండి 50 వేలు దాకా ఖర్చవుతున్నది. ఇది ఆసుపత్రిలో పెట్టిన లక్షల ఖర్చుకి అదనం.

రెండో దశలో స్పానిష్ ఫ్లూ వంటి అంటువ్యాధులు ఘోర విపత్తులు కలుగ జేశాయి, లక్షల మందిని బలి తీసుకున్నాయి. అదే విధంగా కోవిడ్ రెండో అల కూడా అత్యంత ప్రమాదకరంగా వుంటుంది అని శాస్త్రజ్ఞులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందస్తు హెచ్చరికలు చేశారు. కోవిడ్ మొదటి అలకి రెండో అలకి మధ్య కొంత సమయమిచ్చింది. ఆసమయంలో రెండో దశను ఎదుర్కొనేందుకు ప్రణాళికా బద్ధంగా కేంద్రం ప్రయత్నించి ఉండాల్సింది. కానీ, అలా కాకుండా ఎన్నికల పేరుతో భారీ ర్యాలీలు తియ్యడం, సమావేశాలు నిర్వహించడం,

మేళాలు, జాతరలు నిర్వహించడం వంటి కార్యక్రమాలపై కేంద్రీకరించింది. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా కోవిడ్ రెండో అల వచ్చి, వేగంగా విస్తరిస్తోంది, మారణహోమం సృష్టిస్తోంది.

మన దేశంలో సీరమ్ ఇన్స్టిట్యూట్ మరియు భారత్ బయోటెక్ కంపెనీలు Covishield మరియు Covaxine వాక్సిన్ లను రూపొందించారు. ప్రజలందరికీ టీకా వెయ్యడానికి కేంద్రం ఒక సార్వత్రిక విధానాన్ని పాటించి ఉండాల్సింది. కానీ అలా కాకుండా రాష్ట్రాల మధ్య మరియు కేంద్ర రాష్ట్రాల మధ్య వివక్షత చూపిస్తున్నది. వాక్సిన్ రేటు, సరఫరాలు ఏ రాష్ట్రానికి ఆరాష్ట్రం, ఆయా కంపెనీలతో బేరాలాడుకోవాలి. దేశ జనాభాకి తగినట్లు వ్యాక్సిన్ ఉత్పత్తి జరగడం లేదు. దేశంలో పెద్ద పెద్ద ఫార్మా కంపెనీలు ఉన్నప్పటికీ వాక్సిన్ ఉత్పత్తి కి ఆ కంపెనీలకి ముందుగా అనుమతు లివ్వలేదు. కోవిడ్ వాక్సిన్లకు పేటెంట్ హక్కుల నుండి మినహాయింపు నివ్వాలని అమెరికాను కోరిన మన కేంద్ర ప్రభుత్వం ఇక్కడ వేక్సిన్ తయారు చేసే కంపెనీల పేటెంట్లు రక్షించే పనిలో పడింది. ఫలితంగా ప్రజానీకం వేక్సిన్ అందక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి తోడు మన దేశంలో ఉత్పత్తి అయిన వాక్సిన్ లో 6.64 కోట్ల డోసులు జనవరి - ఏప్రిల్ మధ్య కాలంలో ఇతర దేశాలకు ఎగుమతులు చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెబ్సైట్ లో పెట్టింది. వీటన్నింటి వలన వాక్సిన్ కొరత చాలా తీవ్రంగా ఉంది.

2DG మందుని DRDO తయారు చేసింది. ఈ మందు ఇన్ఫెక్ట్ అయిన కణాల్లోకి చేరి వాటి పెరుగుదల, పునరుత్పత్తి జరగకుండా అడ్డు పడుతుంది. ఈ మందు విరివిగా అందుబాటులోకి వస్తే, కోవిడ్ పేషంట్లను ప్రాణాపాయం నుండి తప్పించే అవకాశాలు మెరుగు పడతాయి. రష్యా నుండి స్పుత్నిక్ వాక్సిన్ తెప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కరోనా మహమ్మారి కి హాట్ స్పాట్ గా నిలిచిన అమెరికా, యూరప్ దేశాలలో వేక్సినేషన్ వేగంగా జరుగుతోంది. కరోనా వ్యాప్తి చెందే వేగం మందగిస్తోంది. ఫలితంగా ఆ దేశాలు ఇప్పుడు సాధారణ(అన్ లాక్) పరిస్థితుల వైపు అడుగులు వేస్తున్నారు. మన దేశం వాక్సినేషన్ ఉత్పత్తి లో చూస్తే ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉంది కానీ జనాభాలో శాతంగా పరిశీలిస్తే 65 వ స్థానంలో ఉంది. జనాభా లో అధిక శాతానికి వేక్సినేషన్ వెయ్యకపోవడం వలన మనం ఇంకా కష్టాల్లో మునిగి ఉన్నాము.

## ప్రపంచ ఆరోగ్య సంస్థ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ది హిందూ పత్రిక కు మే 16 వ తేదీన ఇచ్చిన ఇంటర్వ్యూలో ని ముఖ్యాంశాలు:



★ భారతదేశంలో వైరస్ వేరియంట్ B.1.617 చాలా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ది. గతంలో బ్రిటన్ లో గుర్తించిన B.1.1.7 కంటే ఎక్కువ గా వ్యాపిస్తున్నది. ఒరిజినల్ కోవిడ్ వైరస్ కి ఒకటిన్నర నుండి రెండు రెట్లు అధికంగా వ్యాప్తి చెందుతున్నది. ప్రస్తుతం ఇది సుమారు 50 దేశాలకు వ్యాపించింది. WHO అత్యంత ప్రమాదకరమైన వేరియంట్ లు గా గుర్తించిన నాలుగు వేరియంట్ లలో ఇది( latest) తాజాది. ఇది మళ్ళీ చిన్న చిన్న మార్పులతో వేర్వేరు లక్షణాలతో విస్తరిస్తున్నది. ఈ వేరియంట్ వలన జబ్బు తీవ్రత పెరుగుతుందనడానికి తగిన ఆధారాలు ఇంకా లభించలేదు. ప్రాధమిక సమాచారం బట్టి ఈ వేరియంట్ వేక్సిన్ ప్రభావాన్ని (యాంటీబడీస్ ని ఉత్పత్తి చేసే సామర్థ్యం) కొంత మేరకు తగ్గిస్తుంది

★ కోవిషీల్డ్, కోవేక్సిన్ లేదా ఇతర వేక్సిన్ వేసుకున్న తర్వాత ఈ వైరస్ సోకే అవకాశం ఎంత ?, జబ్బు తీవ్రత ఎంత ఉండవచ్చు ? అనే అంశాలపై స్పష్టత రాలేదు. ఇది ఎంత త్వరగా తేలితే అంత ఉపయోగం.

కేవలం వేరియంట్ యొక్క జెనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా స్పష్టత రాదు. వైరస్ సోకిన పేషెంట్లకు వైద్యం చేసిన తీరు, వైరస్ విస్తరిస్తున్న తీరు, వేక్సిన్ తీసుకునే పేషెంట్ల ఆరోగ్య స్థితి కొంత కాలం అధ్యయనం చెయ్యాలి. వేక్సినేషన్ వేసుకున్న వారు ఏ రేటున వ్యాధిగ్రస్తు లవుతున్నారు, వ్యాధి తీవ్రత ఎంత వరకు వుంటున్నది, అనే అంశాలపై స్పష్టత లభిస్తే ప్రణాళికా బద్ధంగా వ్యాధి నెదుర్కొనడానికి అవకాశాలు లభిస్తాయి.

★ ప్రజలకు సంబంధించినంత వరకు కోవిడ్ మూల వైరస్ కు B.1.617 వేరియంట్ కు తేడా లేదు. దాని ప్రభావంలో కూడా పెద్ద తేడా లేదు. ఒక్కో తరహా వేరియంట్ వేగంగా విస్తరించవచ్చు. ఇప్పుడు ఇండియాలో జరుగుతున్నదదే. విస్తరణ తగ్గేలా ప్రజలు జాగ్రత్తలు వహించాలి. విస్తరణ తగ్గడానికి ప్రాధమిక సూత్రాలలో తేడా లేదు. మొదట్లో ఏవిధమైన జాగ్రత్తలు వహించామో అవే జాగ్రత్త లు ఇప్పుడు కూడా అమలు చెయ్యాలి. అంటే, మాస్క్ లు ధరించాలి, భౌతిక దూరం పాటించాలి,  గుంపులుగా సామూహిక కార్యక్రమాలు నివారించాలి, శానిటైజర్లు వాడాలి, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. ఈ వేరియంట్ సామూహిక వ్యాప్తిని నిరోధించాలంటే ఈ జాగ్రత్త లు తప్పనిసరి.

★ ఇంతవరకు లభించిన సమాచారం మేరకు ఇండియాలో లభిస్తున్న వాక్సిన్లు ఈ కొత్త వేరియంట్ పై కూడా శక్తివంతంగా పని చేస్తున్నాయి. అయితే, ఇన్ఫెక్షన్ కి గురయిన వారిలో కొందరు రెండు డోసులు తీసుకున్న వారు కూడా ఉన్నారు. కానీ రెండు డోసులు తీసుకున్నవారిలో అత్యధిక మంది ICU లో చేయవలసినంత ఎక్కువ ఇన్ఫెక్షన్ కి గురి కాకుండా రక్షణ పొందుతారు. సరైన ఆధారాలు లేకుండా వేక్సిన్ వల్ల ప్రయోజనం లేదని అనుకోవడం తప్పు. వేక్సిన్ లు చాలా వరకు రక్షణ నిస్తున్నాయని మేము విశ్వసిస్తున్నాము.

★ ప్రస్తుతం మనం మహమ్మారి చాలా ఉధృతంగా ఉన్న క్లిష్టమైన దశలో ఉన్నాం. వచ్చే 6 నుండి 18 నెలల కాలం అత్యంత గడ్డు కాలం. ఈ కాలాన్ని ఎలా నెట్టుకు రావాలన్న దానిపై ఇప్పుడు దృష్టి కేంద్రీకరించాలి. ఆ తర్వాత ఈ వైరస్ ని పూర్తిగా నిర్మూలించ గలమా లేదా అదుపు చెయ్యగలమా అన్నది చర్చించవచ్చు. ఈ వైరస్ ఏవిధంగా పరిణామం చెందుతుంది, వేక్సిన్ లు ఎంత కాలం రోగనిరోధక శక్తిని నిలబెట్ట గలవు అనే విషయాల పైన భవిష్యత్తు ఆధారపడుతుంది. దీర్ఘ కాలంలో ఏం జరుగుతుందో ఇప్పుడు చెప్పలేం. కానీ, ఇప్పుడున్న మహమ్మారి తీవ్ర దశను మాత్రం అంతం చెయ్యగలమని ఖచ్చితంగా చెప్పగలను.

★ ప్రపంచ జనాభాలో 30% వేక్సినేషన్ పొంద గలిగితే, ఈ వైరస్ సంబంధిత మరణాలు చాలా వరకూ తగ్గి పోతాయి. 2021 చివరికి ఈ కర్తవ్యాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నాం. 2022 లో 60% నుండి 80% వరకు వేక్సినేషన్ పూర్తి చెయ్యాలి.

★ వాస్తవ ఆధారాల ప్రాతిపదికన WHO ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను జారీ చేస్తున్నది. ఎప్పటికప్పుడు ఎదురయ్యే అనుభవాలను బట్టి మార్పులు చేర్పులు చేస్తున్నది. అలాగే, రకరకాల ఔషధాలను కూడా సిఫార్సు చేస్తున్నది. మరణాల నుండి కాపాడడంలో ఇప్పటి వరకు స్టెరాయిడ్స్ ( డెక్సా మిథాసోన్) మాత్రమే మంచి ఫలితాల నిచ్చాయి. ఆసుపత్రిలో అడ్మిట్ అయి ఆక్సిజన్ మీద ఉన్న పేషెంట్ల మీదనే ఈ స్టెరాయిడ్స్ ఎక్కువ ప్రభావం చూపిస్తున్నాయి. ఊపిరితిత్తులకు ఆక్సిజన్ వెళ్ళే మార్గంలో ఇన్ఫ్లమేషన్ (వాపు) ఏర్పడి ఆక్సిజన్ తీసుకోవడం కష్ట సాధ్యం గా మారినప్పుడు, ఈ వాపును తగ్గించడానికి ఈ స్టెరాయిడ్ పని చేస్తుంది.

★ పొరపాటు సమయంలో పొరపాటు ఔషధాలు వాడడం వలన మంచి జరుగక పోగా హాని మాత్రం జరుగుతుందని ప్రజలు గ్రహించాలి. ఇప్పుడు చాలా మంది వాడుతున్న డాక్సీ సైక్లిన్, అజిత్రోమైసిన్, ఐవర్ మెక్టిన్ వంటి మందులు వైరస్ ని తగ్గించినట్లు దాఖలాలు లేవు. నిజానికి, ఐవర్ మెక్టిన్ ని కేవలం వైద్య పరిశోధనల సందర్భంలో తప్ప ఇతరత్రా ఉపయోగించ వద్దని WHO సిఫార్సు చేసింది. అదే విధంగా రెమ్ డెసివర్, హైడ్రాక్సీ క్లోరోక్విన్, లోపినావిర్ లాంటి మందులు కూడా వాడవద్దని సిఫార్సు చేసింది.

★ ఏ దేశానికాదేశం వైద్యం చేసే విధానాల మార్గదర్శకాలు రూపొందించుకోవాలి. అనుభవాలను బట్టి ఎప్పటికప్పుడు తాజా పరచు కోవాలి.

## Vaccine Availability & Eligibility

★ జివిఎమ్సి పరిధి లో ప్రస్తుతం రెండో డోసు వేక్సిన్ మాత్రమే వేస్తున్నారు.

★ కోవేక్సిన్ మొదటి డోసు వేసుకున్న తర్వాత 28 రోజులకు రెండో డోసుకు అర్హులు.

★ కొవిషీల్డ్ మొదటి డోసు వేసుకున్న తర్వాత 12 నుండి 16 వారాల లోపు రెండో డోసు వేసుకోవచ్చు.

# " ఊపిరి"

- నాగభూషణ్ పాఢీ

నీ భయమే
వాడి ' బలం'
నీ బలమే
వాడికి ' భయం'!

బలాన్ని దాచి
భయ పడుతూ
కాలాన్ని
హరిస్తావో....(?)
భయ పడక

బలాన్ని చూపి
సాధించి
కాలాన్నే
జయిస్తావో....(?)
ఆలోచించి
అడుగేయి
ముందుకు!
ఇంకా- ఈ....
జాప్యం
నీకెందుకు??

కన్నీరు మున్నీరై
విలపించే
ఆప్తుల
వెన్నంటి నిలిచి
'ధైర్యా'న్ని పెంచు!
మానవతా
భూషణమై
మమతా
మాధుర్యాన్ని
పంచు!!

ఊరుకుంటే
ఊపిరైనా...
అమ్ముకుంటాడు!
ఉద్యమించే
సాహసమే - నీ..
" ఊపిరి" అయితే
ఉడాయిస్తాడు
చూడు!!

రేపటి... ఆ....
ఉషోదయానికి
నీవే .... ఊపిరై
నాంది పలుకు
'నేడు'!!!

---------------------------------------------------------

## విశాఖపట్నం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి సమాచారం

విషయం : **కోవిడ్ వాక్సినేషన్ కి సంబంధించి నూతన మార్గదర్శకాలు.**

నేషనల్ ఎక్స్పర్ట్ గ్రూప్ ఆన్ వాక్సిన్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ కోవిడ్ 19(NEGVAC) వారు కోవిడ్ పాండేమిక్ మరియు ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుత పరిస్తితులు పై అధ్యయనం చేసి చేసిన సిఫార్సుల ప్రకారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోవిడ్ వాక్సినేషన్ కార్యక్రమం కి సంబంధించి ఈ క్రింది మార్గదర్శకాలను విడుదల చెయ్యడం జరిగింది.

1.లాబ్ పరీక్ష ద్వారా కోవిడ్ వ్యాధి నిర్ధారింపబడినవారు, వారు పూర్తి గా కోలుకున్న నాటి నుండి 3 నెలలు తరువాత మాత్రమే కోవిడ్ వాక్సిన్ తీసుకోవలెను.

2.Anti-SARS-2 మోనోక్లోనల్ యాంటీ బాడీస్ తో గాని convalesent plasma తో గాని చికిత్స పొందిన వారు, ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన నాటి నుండి 3 నెలలు తరువాత మాత్రమే కోవిడ్ వాక్సిన్ తీసుకోవలెను.

3.మొదటి డోస్ వాక్సిన్ తీసుకొన్న తరువాత కోవిడ్ వ్యాధి కి గురి అయితే అట్టి వారు క్లినికల్ గా పూర్తిగా రికవరీ అయిన నాటి నుండి 3 నెలలు తరువాత మాత్రమే వాక్సిన్ తీసుకోవలెను.

4.ఇతర సాధారణ వ్యాధుల తో ఆసుపత్రిలో గాని ICU లో గాని ఉన్నవారు డిశ్చార్జ్ అయిన నాటి నుండి 4 నుండి 8 వారాల వరకు వాక్సిన్ కొరకు వేచిఉండవలెను.

★ కోవిడ్ 19 వాక్సిన్ లు తీసుకున్న వ్యక్తి 14 రోజుల తర్వాత రక్త దానం చెయ్యవచ్చు.

★ కోవిడ్ 19 వ్యాధికి గురయిన వ్యక్తి RT-PCR Negative వచ్చిన తర్వాత రక్త దానం చెయ్యవచ్చు.

★ బాలింతలకు కోవిడ్ వాక్సిన్ సిఫార్సు చెయ్యడం అయినది.

★ కోవిడ్ వాక్సిన్ వేసుకోవడానికి ముందు రాపిడ్ ఆంటీజన్ పరీక్ష చెయ్యవలసిన అవసరం లేదు.

★ గర్భవతులకు వాక్సిన్ ఇచ్చే విషయం పరిశీలనలో ఉన్న కారణంగా National Technical Advisory group on immunization వారి సూచనలు మేరకు తదుపరి నిర్ధారించబడుతుంది.

ఈ నూతన మార్గదర్శకాల పై అన్ని స్థాయిలలోను వాక్సినేషన్ సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వబడును.

---------------------------------------

## VARWA

అధ్యక్షులు N ప్రకాశ రావు, 9440662915, ప్రధాన కార్యదర్శి BB గణేష్, 9440133400, గౌరవాధ్యక్షులు ChLN శాస్త్రి, ఉపాధ్యక్షులు G విజయ్ కుమార్, కామేశ్వర రావు, జాయింట్ సెక్రెటరీ లు GV రమణ, T కామేశ్వర రావు, కోశాధికా ర్లు Y క్రిష్ణ మోహన్ & NV రమణా రెడ్డి

## NIVAS

అధ్యక్షులు సి హెచ్ నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి పి నారాయణ మూర్తి, 9491789269, కోశాధికారి ఆర్ గణేష్ కుమార్.

-------------------------------------------------------

B 25, Jeevan Soudha Apartments, MMTC Colony, HB Colony PO, Visakhapatnam, AP State - 530022.